కథానిక

# ఆకలి

ఆకలి తట్టి లేపటంతో నీరసంగా కళ్ళు తెరిచాడు సత్యం. తన కాళ్ళ వైపు ఎవరో ఒక వయసు మళ్ళిన వ్యక్తి కూర్చుని వున్నాడు.

సిమెంటు బెంచీ మీద లేచి కూర్చున్నాడు సత్యం- ప్లాట్ ఫారం గీవురు గావురు మంటోంది రకరకాల వ్యక్తులతో. రావలసిన బండి గంటన్నర లేటని ఎనౌన్స్‌మెంటు వినబడింది. తను బైల్దేరదామనుకున్న బండి అదే.

ప్రక్కన పెద్దమనిషికి బ్యాగ్ అప్పజెప్పి, ముఖం కడుక్కుని, ఏదో ఒకటి నోట్లో వేసుకుని కడుపు చల్లార్చుకోవాలి అనుకుంటూ బైల్దేరాడు.

మనస్తత్వం ఈ సైడు వాళ్ళలో లేదన్న 'సత్యం' గ్రహించాడు 'సత్యం'.

తనూ అంతే. ఏనాడు పబ్లిగ్గా పది మంది చూస్తుండగా ఏదీ తిని ఎరగడు. హొటల్లో కూడా ఎవరూ లేని చోట ఒక మూల కూర్చుంటాడు. కానీ తనది 'ప్రెస్టీజ్ కాన్షస్' కాదు!

మొహం కడుక్కుని కర్చీపుతో తుడుచుకుంటూ 'రైల్వే రెస్టారెంటుకు వెళ్తే' అనుకున్నాడు సత్యం. కమ్మగా ఇంత అన్నం తినొచ్చు. భోజనం చేశామన్న తృప్తి వుంటుంది. - నీ జేబు అతని ఆలోచనని అడ్డుకుంది. ఇంకో నాల్రోజులు ఇలాగే ప్లాట్‌ఫారాల మీద గడపాలి.

## వి. కె. విశ్వనాథశర్మ

అదొక నార్తిండియన్ స్టేషన్. గరమ్ పూడీ!...గరమ్ పూడీ ... చార్ ఏక్ రుపయా!' తోపుడు బళ్ళ వాళ్ళ కేకలు పోటీలు పడుతూ వినిపిస్తున్నాయి. కాని ఇక్కడ పూరీని మించిన మంచి తిండి ఇంకోటి దొరకదు. పెద్ద పెద్ద సూటూ బూటూ మనుషులు కూడా బండి ముందు నుంచుని తింటూంటారు. 'అరె! ఇంత ఖరీదైన బట్టలేసుకునాం తగ్గట్టు ఎసి రెస్టారెంటుకే వెళ్ళాలి. లేకపోతే పదిమందీ నవ్వరూ!' బజార్లో తోపుడు బండి మీద ఏదన్నా కొనుక్కు తినాలని మనసు పీకినా దాన్ని చంపుకునే ఆంధ్రావాడి

నాలుగు పగళ్ళు- నాలుగు రాత్రులు. ఏం జీవితమో! ఏం ఉద్యోగమో! తనిప్పుడు టెంపరరీ డ్యూటీ మీదున్నాడు. వాగన్ ఎస్కార్టు. ఇటువంటి సమయాల్లోనే ఈ మిలట్రీ అంటే విరక్తి. అసహ్యం. జేబులో వున్న రెండు పదుల్ని తడువుకొన్నాడు. లాభంలేదు. పూరీయో, ఏదో తిని రోజు వెళ్ళమారిందనిపించాలి.

తోపుడు బండి దగ్గరకెళ్ళి నాలుగు పూరీ ఇమ్మన్నాడు. ఒక దొన్నెలో పూరీ ఇంకో దాంట్లో బంగాళా దుంప ముక్కలు వేసిన నీళ్ళపులుసు ఇచ్చాడు బండివాడు.

డబ్బులిచ్చి ప్లాట్‌ఫారం చివరగా వచ్చి, చుట్టూ ఎవరూ లేరని నిర్ధారించుకుని పూరీ కొరుకుతుంటాడు

ఇంకో ముక్క తిన్నాడో లేదో 'ధుపుక్' మన్న శబ్దం. దాని వెనకే ఇంత ఉమ్మి వచ్చి తను తింటున్న పూరీ దొన్నెలో పడింది.

వులిక్కి పడి తలతిప్పేడు సత్యం. పరిగెత్తుకు పోతున్న ఓ పదేళ్ళ కుర్రాడు వెనక్కి తిరిగి చూస్తూ చూస్తూ జనంలో కలసిపోయాడు.

సత్యానికి ఆకలి,కోపం ఎక్కువైంది. అయినా ఏం చెయ్యగలడు? ఎవ్వరూ తనని చూడనట్టుంది. పూరీ దొన్నె చూశాడు

వికారం, వెంట డోకు గొంతు బద్దలు కొట్టుకువస్తోంది పూరీదొన్నెని ట్రాక్ మీదికి విసిరేశాడు కసిగా డోకు బలవంతాన ఆపుకుని పంపుదగ్గరికి నడిచాడు.

నీళ్ళు పుక్కిలించి వచ్చి నీరసంగా బెంచీ మీద కూలబడ్డాడు. అలా తలెత్తగానే ఎదురుగా ట్రాక్ మీద ఆ కుర్రాడు. తను పారేసిన పూరీని బెదురుగా అటూ ఇటూ చూస్తూ జాగ్రత్తగా ఏరుకుంటూ– ఆ కుర్రాడు!–అడుక్కుతినే కుర్రాడు!! ఆకలి కుర్రాడు!!!

---

## ఓట్ల కాలం

ఎలక్షన్లొస్తున్నాయి
మతకలహాలు రెచ్చగొట్టండి
కులాలను జాగృతం చెయ్యండి
ఏ సంఘటననూ వృధాపోనీయకండి
గాలికి పోయే పేలపిండిని
ప్రజల కళ్ళల్లో చల్లండి.
కాల్పులు సృష్టించి
శవాలను జెండాలుగా వాడుకోండి.
వాగ్దానాల ఎరువులేసి
డబ్బు చెట్లకు
ఓట్లు పూయించండి.
మీ అబద్ధాలకు స్పందించే
ఎలిప్రింటర్లతో ఊరేగండి
ఈ గొర్రెల తలకాయలు
మరింత వొంచి పట్టండి
కాని
ఎన్నాళ్ళు ఇట్లా ..
గొర్రెలు కొమ్మిసురుతాయి
కూలబడ్డ మీ మీదినుంచి
గిట్టలు నడిచిపోతాయి

—ఎస్. గోపి